సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

బుధవారం 4-9-2024

సంపుటి: 20 సంచిక: 139

పేజీలు: 4 వెల: రూ.1




## తాగుతున్నారు సరే.. అమ్ముతున్నదెవరు?

పోలీసుల అదుపులో గంజాయిబాబులు । కూపీ లాగుతున్న స్పెషల్ టీమ్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్ పరిధి తోటపాలెం పరిసర ప్రాంతాల్లో గంజాయి సేవిస్తున్న ఆరుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. నగరంలో గంజాయి వాడకం విచ్చలవిడి కావడంతో కొత్త ఎస్పీ దీని మీద ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగా మఫ్టీలో ఉన్న పోలీసులు గంజాయి సేవిస్తున్న అడ్డాలపై దాడులు చేయగా తోటపాలెం వద్ద ఆరుగురు యువకులు దొరికారు. వీరిని ప్రశ్నించి నగరంలో గంజాయి బ్యాచ్ ఎవరన్న దానిపై ఆరా తీస్తున్నారు. ఏయే వీధుల్లో ఎవరెవరు తాగుతున్నారన్న గుట్టు వీరి నుంచి రాబడుతున్నారు. గంజాయి తాగడం వరకు అలవాటున్నవారిని పునరావాస కేంద్రాలకు పంపినా ఫలితం ఉంటుంది కానీ, అమ్మేవారిని మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించకూడదని ఎస్పీ భావిస్తున్నారు. మొత్తం నగరాన్ని జల్లెడ వేసి జిల్లా మొత్తం గంజాయి బాబులను పోలీస్‌స్టేషన్‌కు తరలించడానికి రంగం సిద్ధమైంది. వీరి ద్వారా గంజాయి విక్రయిస్తున్నవారిని పట్టుకొని నార్కోటిక్స్ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని ఎస్పీ మహేశ్వరర్‌రెడ్డి భావిస్తున్నారు. ఇందులో భాగంగ తోటపాలెం వద్ద దొరికినవారిని వన్‌టౌన్‌లో పెట్టి ఆరా తీస్తున్నారు. ఈ విషయాన్ని పెద్దది చేసి గంజాయి ముఠా పారిపోకుండా పత్రికలు సహకరించాలని పోలీసు అధికారులు కోరుతున్నారు.






- ప్రభుత్వం మద్యం సిబ్బందికి మంగళం
- అప్పులు చేసి ఉద్యోగాలు కొన్న అభాగ్యులు
- ఎక్సైజ్ శాఖకు కిక్.. సేల్స్‌మెన్‌లకు బ్యాడ్‌లక్

## పాపాలు కడిగేస్తున్నారు!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రభుత్వాలు మారినప్పుడు పాలసీలు మారడం, విధానాలు మారినప్పుడల్లా చిరుద్యోగులు బలైపోవడం సాధారణం. కాకపోతే ఈసారి ప్రభుత్వం మారుస్తున్న విధానం వల్ల నష్టపోతున్న చిరుద్యోగులు ఉద్యోగాలను మాత్రమే కాదు.. వారు అంతకు క్రితం కూడేసుకున్న సొమ్ములు కూడా. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం వ్యాపారాన్ని చేపట్టింది. ఇందుకోసం సేల్స్‌మెన్‌లను, సూపర్‌వైజర్లను నియమించుకుంది. అప్పటి వరకు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉన్న ఉద్యోగుల మాదిరిగానే వీరికి కూడా ఉద్యోగ భద్రత కల్పిస్తామని పేర్కొంది. దీంతో సేల్స్‌మెన్, సూపర్‌వైజర్ పోస్టుల కోసం అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలతో సిఫార్సులు చేయించుకొని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కమ్ డిపో మేనేజర్లకు లక్షల్లో డబ్బులు ముట్టజెప్పి ఈ ఉద్యోగాలు పొందారు. ఇప్పుడు మద్యం వ్యాపారాన్ని ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడంతో వీరి ఉద్యోగానికి భద్రత లేకుండాపోయింది. ఏ ఖర్చు లేకుండా ఈ ఉద్యోగాలు తెచ్చుకొనివుంటే ఇంత సమస్య ఉండేదికాదు. ఒకసారి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా చేరితే పర్మినెంట్ అయినా, కాకపోయినా కొనసాగింపునకు ఢోకా ఉండదని భావించి అనేకమంది అడిగినప్పుడల్లా సొమ్ములు చెల్లించేశారు. తీరా వచ్చే నెల నుంచి మద్యం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడంతో తాము అప్పు చేసి వివిధ దఫాలుగా చెల్లిస్తున్న సొమ్ముల మాటేమిటని ప్రభుత్వ వైన్‌షాపుల్లో పని చేస్తున్న వ్యక్తులు ప్రశ్నిస్తున్నారు. 2019 నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వమే మద్యం దుకాణాలు నిర్వహిస్తుండటం వల్ల ఎక్సైజ్ శాఖకు అంతకు ముందు మాదిరిగా విచ్చలవిడిగా సొమ్ములు వచ్చే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో ప్రభుత్వ షాపుల మీద కేసులు రాయడం, సేల్స్‌మెన్, సూపర్‌వైజర్లను బదిలీ చేయడం, కౌంటర్‌లో సొమ్ములు తక్కువ ఉన్నాయని, లిక్కర్ కల్తీ అవుతోందని.. ఇలా రకరకాల పేర్లతో కేసులు రాసి సంబంధిత షాపులు నిర్వహిస్తున్న సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్ల నుంచి డిపో మేనేజర్ సుబ్బారావు ఇబ్బడిముబ్బడిగా సొమ్ములు దండుకున్నారు. ప్రతీ వైన్‌షాపు నుంచి ఏదో ఒకరూపంలో సొమ్ములు వసూలుచేసే పని పెట్టుకున్నారు. దీనికి స్వయంగా సేల్స్‌మెన్‌లు, సూపర్‌వైజర్లే మధ్యవర్తులుగా వ్యవహరించారు. 2019 నుంచి ఇప్పటి వరకు అనేక రూపాల్లో సొమ్ములు సమర్పించారు. ఇవన్నీ అప్పు చేసో, తప్పు చేసో ఎక్సైజ్ అధికారులకు సమర్పించినవే. ఎలా ఉన్నా తమకు భవిష్యత్తు ఉంటుందని భావించడం వల్లే ఇవన్నీ చేసుకొచ్చారు. కానీ ఇప్పుడు ప్రైవేటు షాపులు రావడం వల్ల వీరందరూ ఉద్యోగాలు కోల్పోవడంతో పాటు అప్పులు తీర్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రైవేటు యాజమాన్యాలకు షాపులివ్వడం ఎక్సైజ్ ఉద్యోగులకు ఆనందం కలిగిస్తుండగా, షాపుల్లో పని చేస్తున్నవారు మాత్రం ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ షాపుల్లో పని చేస్తున్నవారినే ప్రైవేటు యాజమాన్యాలు తీసుకుంటాయి కదా.. ఇందులో వారికొచ్చిన నష్టమేమిటన్న ప్రశ్న తలెత్తకమానదు. 2019కి ముందు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో వైన్‌షాపులు ఉన్నప్పుడు అనేకమంది పని చేశారు. ప్రభుత్వ షాపులు వచ్చిన తర్వాత ఇందులో మూడొంతుల మందికి ఉపాధి లేకుండాపోయింది. ఇప్పుడు వారందర్నీ కొత్త షాపుల్లో అకామిడేట్ చేస్తారు. దీంతో ప్రభుత్వ షాపుల్లో పనిచేసినవారిలో చాలామందికి ఉపాధి లేకుండాపోతుంది. 2019 నుంచి సేల్స్‌మెన్‌లు, సూపర్‌వైజర్లతో అనేక పాపాలు చేయించి ఇప్పుడు ఉపాధి లేకుండా చేయడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది.

అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం అక్టోబర్ ఒకటి నుంచి నూతన మద్యం పాలసీని అమలు చేస్తున్నట్టు ప్రకటించింది. దీంతో ప్రభుత్వ మద్యం షాపుల స్థానంలో ప్రైవేట్ మద్యం దుకాణాలు రానున్నాయి. దీని కారణంగా జిల్లాలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న వారితో పాటు స్వీపర్లను కలుపుకొని 1,351 మంది ఆందోళన వ్యక్తంచేస్తూ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన వ్యక్తం చేయనున్నారు. మద్యం ప్రైవేట్ చేతిలోకి వెళితే ఐదేళ్లుగా అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న సిబ్బందిని తొలగిస్తారన్న ప్రచారంతో ఉద్యోగులంతా ఆందోళనబాట పట్టారు. గతనెల రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు నిర్వహించి నిరసన తెలిపారు. ఉద్యమ కార్యచరణలో భాగంగా ఈ నెల 7న మద్యం దుకాణాలు మూసివేయాలని నిర్ణయించారు. ప్రభుత్వం నూతన పాలసీ అమలుచేస్తే రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 15 వేల కుటుంబాలు రోడ్డున పడనున్నాయని ఉద్యోగులంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్ ద్వారా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తిస్తామని ప్రకటించిన అప్పటి - మిగతా 4లో

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్

విజయవాడ, ఆంధ్రప్రదేశ్

ఇ-టెండరు ప్రకటన

టెండరు నం: APSBCL/01/MAN POWER/ROS/2024

ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ రిటైల్ ఔట్‌లెట్స్ మరియు హోల్‌సేల్ డిపోలలో పని చేయడానికి సేల్స్ సూపర్‌వైజర్స్, సేల్స్‌మెన్ మరియు DEOs / AAOs మొ.న మ్యాన్‌పవర్‌ను అవుట్‌సోర్సింగ్ ప్రాతిపాదికన ఏర్పాటు చేయడానికి ఏజెన్సీ ఎంపిక కొరకు పోటీ ఇ-టెండరింగ్ ప్రక్రియ ద్వారా ప్రతిపాదనలు ఆహ్వానిస్తోంది. టెండరు డాక్యుమెంట్‌లో పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం రెండు (2) నెలలు అంటే ఆగస్టు మరియు సెప్టెంబర్ 2024 కొరకు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న వివిధ రిటైల్ ఔట్‌లెట్లకు కావలసిన మ్యాన్‌పవర్ సిబ్బందిని సదరు ఏజెన్సీ ఏర్పాటు చేయవలెను. అర్హతా ప్రమాణాలు, పని స్వభావం మరియు నియమ నిబంధనలకు సంబంధించిన ఇతర సమాచారం మొత్తం కార్పొరేషన్ వెబ్‌సైట్ అంటే www.apsbcl.ap.gov.in మరియు www.tender.apeprocurement.gov.in లో కూడా లభిస్తుంది. ఏవేని తదుపరి స్పష్టీకరణల కొరకు మెయిల్ ఐడీ: apsbclco2122@gmail.com, సంప్రదించు నం: 9493478962

చిరునామా: ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్, 88-2బి, కోళ్లఫారం రోడ్డు, SER సెంటర్, ప్రసాదంపాడు, విజయవాడ, ఆం.ప్ర.-521108

సం/- మేనేజింగ్ డైరెక్టర్

DIPR RO No.3118-PP/CL/ADVT/1/1/2021-22, Dt: 13.08.2024



• ఎడిటోరియల్

# అమరావతిపై ముసుగు కప్పేస్తున్నారు!

ఏపీ హైకోర్టుకు రెండు రోజులు సెలవులు ప్రకటించాలని గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. ఆ మేరకు మంగళవారం సాయంత్రం ఆమె హైకోర్టు రిజిస్ట్రార్‌కు లేఖ రాశారు. భారీ వర్షాలు, వరదలే దీనికి కారణమని వేరేగా చెప్పక్కర్లేదు. కలెక్టరే హైకోర్టుకు సెలవులు ప్రకటించారని సూచించారంటే ఆ ప్రాంతంపై వరదల ఎఫెక్ట్ ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇంతకూ రాష్ట్ర హైకోర్టు ఎక్కడుందంటే.. విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ఆధునిక రాజధానిగా తీర్చిదిద్దుతామని తెలుగుదేశం సర్కారు చెబుతున్న అమరావతిలోనే! అంటే అమరావతి ప్రాంతాన్ని వర్షాలు, వరదలు తీవ్రంగా దెబ్బతీశాయని ఎవరికైనా ఇట్టే అర్థమైపోతుంది. చాలా పత్రికలు, టీవీల్లోనూ ఆ ప్రాంతంలో జరిగిన నష్టాల గురించి, ముంపు ప్రాంతాల్లో కష్టాల గురించి ఫొటోలతో సహా వార్తలు వస్తున్నాయి. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం అదంతా తప్పుడు ప్రచారమని కొట్టిపారేస్తున్నారు. కావాలని చేస్తున్న దుష్ప్రచారమని ఖండిస్తూ.. ఆ విధంగా వార్తలు రాసేవారిపైనా, ప్రచారం చేసే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని కూడా హెచ్చరించారు. ఆయన వైఖరి ఇప్పుడు విమర్శల పాలవుతోంది. భారీ వర్షాలకు ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, కృష్ణా జిల్లాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. విజయవాడ నగరంతో సహా ఇంకా చాలా ప్రాంతాలు వరద ముట్టడిలోనే ఉన్నాయి. విజయవాడ నగరంలో స్వయంగా సహాయ కార్యక్రమాలు పర్యవేక్షిస్తూ పర్యటనలు జరుపుతున్న చంద్రబాబుకు సైతం ఆ విషయం తెలుసు. అదే రీతిలో గుంటూరు, విజయవాడ మధ్యలో ఉన్న రాజధాని అమరావతి ప్రాంతం కూడా వరద గుప్పిట్లో చిక్కుకుని విలవిల్లాడుతోంది. దానికి ప్రత్యక్ష నిదర్శనం రాష్ట్ర హైకోర్టే. హైకోర్టు భవనంలోని చాలా గదుల్లోకి వరద నీరు ప్రవేశించడం, పైకప్పులు కారిపోతుండటంతో విధులకు హాజరైన ఉద్యోగులు ఫైళ్లు తడిసిపోకుండా తాము కూర్చునే కుర్చీల్లోనే పెట్టి, వారు మాత్రం నిలువుకాళ్ల జపం చేయాల్సి వచ్చింది. ఇక హైకోర్టులో సోమవారం కేసుల విచారణలు ప్రారంభమైనా పరిస్థితులు అనుకూలించక మధ్యలోనే వాటిని వాయిదా వేసి జడ్జిలు, న్యాయవాదులు తిరుగుముఖం పట్టారు. పరిస్థితిని గుర్తించి ఆన్‌లైన్ విచారణలు జరపాలని నిర్ణయించారు. కానీ వర్షాలు ఇంకా అడపాదడపా పడుతుండటం, అమరావతి పరిధిలో కరకట్ట రోడ్డు మొత్తం దెబ్బతింది. రాష్ట్ర సచివాలయం, హైకోర్టుకు వెళ్లే మార్గాలన్నీ వరద తాకిడితో కోతకు గురయ్యాయి. వాటితో పాటు అమరావతి పరిధిలోని దాదాపు అన్ని రోడ్లు నాశనమయ్యాయి. తుళ్లూరు, మందడం, వెంకటాయపాలెం, వెలగపూడి తదితర సీఆర్‌డీఏ గ్రామాల దారులన్నీ మూసుకుపోయాయి. అంతేనా.. కరకట్టపైనే ఉన్న సీఎం చంద్రబాబు నివాసం వరదముట్టడిలో చిక్కుకుంది. ప్రముఖ ప్రకృతి వైద్యుడు మంతెన ఆశ్రమం వద్ద రోడ్డు కొట్టుకుపోయి కంకర బయటకొచ్చింది. అనేక రోడ్లు గుంతలతో నిండిపోయాయి. వీటన్నింటినీ యుద్ధప్రాతిపదికన రిపేర్ చేయించేందుకు గుంటూరు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. పనుల నిర్వహణ కోసం కరకట్ట మార్గాన్ని రెండు రోజులపాటు మూసివేయాలని నిర్ణయించింది. అందువల్లే హైకోర్టుకు రెండు రోజులు సెలవులు ఇవ్వాలని స్వయంగా కలెక్టర్ సూచించారు. భారీ వర్షాలు, వరదలు అమరావతి ప్రాంతంలో విధ్వంసం సృష్టించాయని ఇవన్నీ చెప్పకనే చెబుతున్నాయి. అమరావతిని వరద ముంచెత్తడానికి కృష్ణానదికి ఊహించనంత వరద రావడంతో పాటు బుడమేరు, మున్నేరు వంటి వాగులు ఉప్పొంగడం వంటివి కారణంగా నిలుస్తున్నాయి. కానీ సీఎం చంద్రబాబు మాత్రం ఇవన్నీ తప్పుడు ప్రచారాలని ఖండిస్తున్నారు, హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అమరావతి నిర్మాణానికి కంకణబద్ధుడైన ఆయన అందుకు అవసరమైన నిధుల కోసం అంతర్జాతీయ ఆర్థిక సంస్థలతో చర్చలు జరుపుతున్నారు. ఈ పరిస్థితుల్లో అమరావతి ప్రాంతమే వరదలకు మునిగిపోయిందని బయట ప్రపంచానికి తెలిస్తే రుణాలు ఇవ్వడానికి అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు ముందుకు రావేమోనన్నది ఆయన భయం కావచ్చు. అలాగే విద్యా, ఇతర వ్యాపార సంస్థలు కూడా ఇక్కడ కార్యకలాపాలు చేపట్టడానికి వెనుకంజ వేయవచ్చన్న ఆందోళన కూడా ఉంది. అందుకే ఆయన అమరావతి వరదల్లో చిక్కుకోవడం వాస్తవమే అయినా ఆ వార్తలు మాత్రం రాయకూడదన్నట్లు మాట్లాడుతున్నారు. అసలు అమరావతి ప్రాంతం రాజధాని ఏర్పాటుకు అనుకూలమైనది కాదని గతంలోనే జస్టిస్ శ్రీకృష్ణ వంటి కమిటీలు తేల్చి చెప్పేశాయి. ఈ ప్రాంతంలో ప్రవహించే కొండవీడు వాగు వల్ల కొత్త రాజధానికి వరద ముప్పు ఉంటుందని నిపుణులు చెప్పారు. కానీ ఆ సలహాలను పట్టించుకోకుండా ఏటా మూడు పంటలు పండే సారవంతమైన భూములను అమరావతి కోసం సేకరించారు. అది ఒక లోపమే. ఎందుకంటే పంటలు, నీటివనరులతో ఈ ప్రాంతంలోని నేల చాలా వదులుగా ఉంటుంది. దాంతో భారీ నిర్మాణాలు చేపట్టడం కష్టతరంగా మారుతుంది. వాటి పునాదులను చాలా లోతుగా వేయాల్సి ఉంటుంది. దానివల్ల నిర్మాణ ఖర్చులు పెరిగిపోతాయి. పైగా వరదల ముప్పు ప్రతి వర్షాకాలంలోనూ వెంటాడుతుంటుంది. వర్షాలకు భూమి వేగంగా నానిపోయి నిర్మాణాలకు ముప్పు కలిగే ప్రమాదం ఉంది. అయితే రాజధాని నిర్మాణానికి ఒకేచోట అత్యధిక స్థలం అక్కడ తప్ప మరెక్కడా దొరకదన్న ఆలోచనతో మూడు పంటలు పండే సారవంతమైన భూములను రైతుల నుంచి సేకరించి రాజధాని నిర్మాణానికి అంకురార్పణ చేశారు. కానీ ఇప్పుడు సంభవించిన వరదలకే అక్కడ పరిస్థితి దయనీయంగా మారింది. ఇదే కృష్ణమ్మ ఉగ్రరూపం, బుడమేరు, మున్నేరు, కొండవీడు వాగుల వరద ఉధృతి భవిష్యత్తులోనూ దాడి చేయవచ్చు. అప్పుడు అమరావతిలో పరిస్థితి ఎలా ఉంటుందో?!

# వరద బాధితుల సహాయార్థం ఆహార కిట్లు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

విజయవాడ వరద బాధితుల సహాయార్థం రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం శాఖ చైర్మన్ పి.జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో రిలీఫ్ మెటీరియల్ రథాన్ని సిద్ధం చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిలీఫ్ మెటీరియల్ రథాన్ని మంగళవారం రాత్రి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సేవలు వెలకట్టలేనివని, సేవలకు ప్రతిరూపం ఇండియన్ రెడ్‌క్రాస్ అని అన్నారు. అనంతరం సహాయార్థం అందించే ఆహారపు కిట్ల వివరాలపై ఆరాతీశారు. అలాగే న్యూ సెంట్రల్ స్కూల్ యాజమాన్యం, విద్యార్థుల ద్వారా అందించిన సేవలను గుర్తిస్తూ జూనియర్ రెడ్‌క్రాస్ సేవలను కొనియాడారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహన్‌రావు మాట్లాడుతూ వరద బాధితులకు కనీసం తాగటానికి, తినటానికి కూడా ఇబ్బంది పడుతున్నారని, ప్రకృతి తాండవంతో ప్రజలంతా ఆహారం లేక బాధపడుతుండటం వర్ణనాతీతమన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ శ్రీకాకుళం శాఖ నుంచి రూ.5.50 లక్షలు విలువ చేసే సరుకులను సిద్ధం చేశామన్నారు. ఈ మహత్తర కార్యక్రమానికి ధన, వస్తు రూపేన అండగా నిలిచిన ఎంవీ రమణమూర్తి వెల్ఫేర్ సొసైటీ, సీవీ నాగజ్యోతి వెల్ఫేర్ సొసైటీ, మల్లా కళ్యాణ్ చక్రవర్తి కుటుంబ సభ్యులు, న్యూ సెంట్రల్ స్కూల్, డాక్టర్ సోమేశ్వరరావు, వరం ఛారిటబుల్ ట్రస్ట్, దుర్గ ధీరజ్ ఛారిటబుల్ ట్రస్ట్, డాక్టర్ నిక్కు అప్పన్న, బి.చిన్మయరావు, రాజాం పొట్ట చిట్టిబాబు, కిరణ్, సీనియర్ సిటిజన్ తదితరులకు కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సెక్రటరీ బి.మల్లేశ్వర రావు, ట్రెజర్ కె.దుర్గ శ్రీనివాస్, ఇంటర్నల్ ఆడిటర్ వైకుంఠరావు, ఎంసీ మెంబెర్స్ పి.శ్రీకాంత్, చక్రవర్తి, కళ్యాణ్, అకౌంట్స్ మేనేజర్ బి.సతీష్ కుమార్, ప్రోగ్రాం మేనేజర్ జి.రమణ, జాతీయ అవార్డు గ్రహీత పి.చైతన్యకుమార్, ప్రతినిధులు నంది ఉమాశంకర్, నారా హర్షవర్ధన్, కోఆర్డినేటర్ ఉర్లం శివతేజ, జెఆర్సీ, వైఆర్సీ విద్యార్థులు, బ్లడ్‌బ్యాంకు ప్రతినిధులు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షునిగా పోలుమహంతి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జాతీయ బీసీ సంక్షేమ సంఘం (రిజిస్టర్ నెంబర్. 2187/92) శ్రీకాకుళం జిల్లా శాఖ అధ్యక్షునిగా పోలుమహంతి ఉమామహేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు మగళవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఉమామహేశ్వరరావు గ్రామీణ వ్యవసాయ కుటుంబంలో సారవకోట మండలం మదనాపురం గ్రామంలో జన్మించి, బీసీ సంక్షేమ శాఖలో ఉద్యోగం చేసి 2020 డిసెంబర్‌లో పదవీ విరమణ చేశారు. శ్రీకాకుళం జూనియర్ ఛాంబర్ (జేసిఐ) అధ్యక్షులుగా సేవలందించి, ప్రస్తుతం జెసిస్ సీనియర్ మెంబర్ అసోసియేషన్ అధ్యక్షునిగా వ్యవహరిస్తున్నారు. 2004లో ఆదిత్య వాకర్స్ క్లబ్ స్థాపించి ఉత్తరాంధ్రలో నడక ప్రాచుర్యం గురించి విశేష కృషి చేస్తున్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా 102 గవర్నర్ గాను, రెడ్‌క్రాస్ సంస్థ, సమతా మమత ఛారిటబుల్ ట్రస్ట్‌లో జీవిత సభ్యునిగా కొనసాగుతున్నారు. ఏపీ బీసీ సంక్షేమ శాఖ ఉద్యోగ సంఘ నాయకునిగా మంచి పేరు తెచ్చుకున్నారు. గతంలో పలు పర్యాయాలు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జాతీయ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బీసీ సంఘాలతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య, రక్తదాన శిబిరాలు, చలివేంద్రాలు, అరసవిల్లి పుణ్యక్షేత్రంలో ఏటా రథసప్తమి నాడు భక్తులకు అల్పాహారం, మంచినీరు ఏర్పాట్లు, వేసవిలో డచ్ భవనం వద్ద చిన్నారులకు ఆటపాటల్లో శిక్షణ, ఉచిత న్యాయ శిబిరాలు, చలికాలంలో పాదచారులకు దుప్పట్ల పంపిణీ తదితర సేవాకార్యక్రమాలు చేస్తున్నారు. ఈయన చేస్తున్న ప్రజాహిత కార్యక్రమాలను గుర్తించి జిల్లా కలెక్టర్లు ప్రశంసా పత్రాలు అందజేశారు. జేసీస్ ద్వారా విశిష్ట సేవలు చేసినందుకు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ కమల పత్ర అవార్డు పొందారు.






నాగార్జున అగ్రికం పరిశ్రమలో పనిచేస్తూ లింగాల సన్యాసి అనే కార్మికుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతుని కుటుంబానికి ఎన్‌ఏసీఎల్‌లో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు తమ ఒకరోజు వేతనాన్ని విరాళంగా వసూలుచేసి మొత్తాన్ని మృతుని భార్య ఈశ్వరమ్మ, కుమారుడు వరదరాజులకు చెక్కు, డబ్బుల రూపంలో అందజేశారు. కార్యక్రమంలో సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎన్‌ఏసీఎల్ ఇండస్ట్రీస్ వైస్ ప్రెసిడెంట్ కె.శేషగిరిరావు, హెచ్‌పీడీ హెడ్ కె.శ్యాంప్రసాదరావు, నాగార్జున అగ్రికం వర్కర్స్ యూనియన్ నాయకులు ఎల్.రామప్పడు, ఎం.రమణ, పి.నాగేశ్వరరావు, సిహెచ్ సత్యనారాయణ, జె.నూకరాజు, పి.చిన్న, కె.అప్పన్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, ఎచ్చెర్ల

## తుపాను బాధితులకు అండగా లయన్స్ క్లబ్ శ్రీకాకుళం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తుపాను బాధితులకు అండగా లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ నిలవటం హర్షనీయమని, ముందస్తు సేవలకు, నిస్వార్థ సేవలకు చిరునామ లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అని కలక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. రాష్ట్రమంతా వరదలతో బాధపడుతున్న బాధితుల సహాయార్థం రూ.25వేలు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అందించటం గొప్పవిషయమన్నారు. పర్యావరణ పరిరక్షణ బాధ్యతను తీసుకోవాలని, విద్యార్థులకు, ప్రజలకు ఉపయోగాపడే అవగాహన కార్యక్రమాలను సైతం నిర్వహించి అందరిలో చైతన్యం తేవాలని సూచించారు. లయన్స్ మెంటర్ నటుకుల మోహన్ మాట్లాడుతూ జోన్ చైర్మన్ పొన్నాడ రవి, అధ్యక్షులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, సెక్రటరీ డాక్టర్ పైడి సింధూర సహకారంతో సేవలు విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మార్కెటింగ్ చైర్‌పర్సన్ ఉర్లం శివతేజ, సభ్యులు గుత్తు చిన్నారావు, డాక్టర్ పైడి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



# ఒక్క చిన్న స్పర్ధ.. ఆ ద్వయాన్ని విడదీసింది!



జానే వాలే కబీ నహీ ఆతే.. జానే వాలే కీ యాదా ఆతీ హై.. (వెళ్లేవాళ్లు ఎప్పటికీ రారు.. వెళ్లేవాళ్లని మిస్సవుతున్నాము.) ఎప్పటికీ మర్చిపోలేని ఈ పాట రాజేంద్రకుమార్, మీనాకుమారి వంటి నాటి స్టార్స్ నటించిన దిల్ ఏక్ మందిర్ లోనిది. ఈ పాట ఎంతగా జనాన్ని వెంటాడేలా సంగీతమందించారో ఆ ద్వయం ఇప్పుడు లేకపోయినా వారి జ్ఞాపకాలు మాత్రం ఇంకా సినీ పాటల ప్రేమికుల్ని పాట లీడ్‌లో సారాంశంలాగే వారి యాదిలో ముంచెత్తూనే ఉంటాయి. వారే బాలీవుడ్ దిగ్గజ సంగీత ద్వయం.. శంకర్ జైకిషన్! అయితే, ఒక చిన్న ఇష్యూ శంకర్ జైకిషన్ ద్వయాన్ని విడగొట్టింది. ఒక అద్భుతమైన స్నేహానికి బ్రేక్ అప్ పడి.. అప్పటివరకూ వారి పాటల తోటలో సుస్వరాల సువాసన వెదజల్లిన అన్నదమ్ముల్లాంటి వ్యక్తులు దూరమయ్యారు. ఆ తర్వాత జైకిషన్ ను డిప్రెషన్ లోకి వెళ్లి ఏకంగా తాగుడుకు బానిసయ్యాడు. ఆ బానిసత్వమే జైకిషన్ చిన్నవయస్సులోనే తన ప్రాణాలు కోల్పోవడానికి కారణమైందని గతంలో ఓ ఇంటర్వ్యూలో అలనాటి హీరో, ప్రముఖ నటుడు షమ్మీ కపూర్ చెప్పుకొచ్చాడు.

## అసలేం జరిగింది?

1971 సెప్టెంబరు 12వ తేదీన.. సరిగ్గా 42 ఏళ్ల చిన్న వయస్సులోనే సంగీత మేధావి జైకిషన్ మరణించాడన్న వార్త శంకర్ జైకిషన్ అభిమానగణంతో పాటు.. జస్ట్ లైక్ భార్యాభర్తల్లా కలిసి నడిచిన సంగీత ద్వయంలోని శంకర్‌నూ కలిచివేసింది. ఆ తర్వాత ఆయన లేని లోటు పూరించబడకపోగా.. ఆ ద్వయం విడిపోయి.. వారి సంగీతంలోని శూన్యం కొట్టొచ్చినట్టు కనిపించింది. శంకర్ జైకిషన్ ముంబైలోని పృథ్వీ థియేటర్‌లో కలిసి.. తమ కెరీర్‌ని ప్రారంభించారు. శంకర్ అప్పటికే బాలీవుడ్ సంగీత దర్శకుడిగా ఎదగాలని ప్రయత్నిస్తున్నాడు. గుజరాతీ డైరెక్టర్ చంద్రవదన్ దగ్గరకు తరచూ వెళ్తుండేవాడు. చంద్రవదన్ కూడా తాను తీయబోయే సినిమాకు అవకాశమిస్తానన్న హామీ ఇవ్వడంతో.. వారి బంధం బలపడింది.

ఆ క్రమంలోనే.. అక్కడ తరచూ కనబడుతున్న జైకిషన్‌తో వారిద్దరూ మాటలు కలిపారు. అప్పుడు జైకిషన్ మంచి హార్మోనియం ప్లేయర్ అనే విషయం తెలిసింది. అలా శంకర్ –జైకిషన్ మధ్య ఒక బంధమేర్పడింది. ఫ్రీక్వెన్సీ మ్యాచైంది. అలా ఇద్దరూ కలిసి బాలీవుడ్ సంగీత ద్వయంగా తమ ప్రయత్నాలను ముమ్మురం చేస్తున్న క్రమంలో 1949లో వచ్చిన రాజ్ కపూర్ బర్సాత్ తో మంచి బ్రేక్ దొరికింది. 60వ దశకం నుంచి శంకర్ –జైకిషన్ ద్వయం పాటలకు తిరుగులేకుండా పోయింది.

అంతేకాదు.. ఈ ఇద్దరూ కలిసి భారతీయ సినిమా సంగీతానికి.. ముఖ్యంగా బాలీవుడ్ పాటలకు జాజ్ స్టైల్‌ను అద్దిన ద్వయంగా కూడా పేరు తెచ్చుకున్నారు. జాజ్ సంగీతాన్ని భారత్‌లో వినిపించే క్రమంలో వీరిద్దరిదీ ప్రముఖపాత్ర. ఆ క్రమంలో 1968లో రాగా–జాజ్ స్టైల్ పేరుతో తీసుకొచ్చిన ఆల్బమ్ ఓ ఇన్నోవేటివ్ ఎక్స్పరిమెంట్. స్యాక్సఫోన్, సితార్, తబలా, బేస్ గిటార్, ట్రంఫెట్ వంటి వాద్యాలతో ఒక నూతన ఒరవడిలో చేసిన 11 పాటలు శంకర్ జైకిషన్ ప్రయోగశైలిని వినిపిస్తాయి.

1966లో రాజేంద్రకుమార్, వైజయంతీమాల నటించిన సూరజ్ సినిమా ఈ ఇద్దరు లెజెండ్ సంగీత దర్శకులు విడిపోవడానికి ప్రధాన కారణమైంది. అందుకు ఓ సింగర్ కారణమవ్వడం.. ఆ తర్వాత జరిగిన పరిణామాలు.. ఒక చిన్న స్పర్ధ మనుషులను ఎంత కృంగదీస్తుందో తెలియజెప్పాయి. సూరజ్‌లో పాపులరైన తీతలీ ఊదీ పాటకు.. శంకర్ కొత్త గాయకురాలైన శారదను పరిచయం చేస్తూ అవకాశమిచ్చాడు. కానీ, అది జైకిషన్‌కు నచ్చలేదు. అప్పటికే ఆ పాటను తాను లతామంగేష్కర్ తో పాడించాలని నిర్ణయించుకున్నాడు. గాయకురాలి విషయంలో తలెత్తిన ఆ విభేదం.. ఇక వారిద్దరిని కొన్నాళ్లపాటు కలువకుండా చేసింది.

శంకర్ జైకిషన్ వంటి సంగీత ద్వయం లేని లోటు బాలీవుడ్‌లో అప్పుడు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న క్రమంలో..చాలామంది ప్రముఖులు ఈ విషయంపై పెద్ద చర్చలే చేశారు. ఇద్దరూ ఆఫర్స్ దక్కించుకునేటప్పుడు.. శంకర్ జైకిషన్ ద్వయంగానే దక్కించుకున్నా.. కొన్నాళ్లపాటు విడివిడిగా సంగీతమందించారు. ఈ క్రమంలో గతంలో శంకర్ జైకిషన్ ఇచ్చినంత హృద్యమైన సంగీతం రాకపోవడం పెద్ద చర్చకు తావిచ్చింది. అందులో భాగంగా ప్రముఖ సింగర్ మహ్మద్ రఫీ వీరిద్దరినీ కలిపే ప్రయత్నం చేసి సఫలీకృతుడయ్యాడు. కానీ, వారిద్దరి బంధం అప్పుడు మునుపటంత బలంగా కనిపించలేదు. ఏదో కృతకంగా కలిసి పనిచేశారు. అదే సమయంలో జైకిషన్ బాగా తాగుడుకు బానిసయ్యాడు. 1971లో లివర్ సిర్రోసిస్ కారణంగా జైకిషన్ మరణించాడు.

శంకర్‌తో వేర్పాటే.. జైకిషన్ మరణానికి గల ప్రధాన కారణమని.. మద్యానికి బానిసవ్వడంతోనే జైకిషన్ ఆరోగ్యం క్షీణించిందని గతంలో జైకిషన్ సన్నిహితుడైన అలనాటి బాలీవుడ్ హీరో షమ్మీకపూర్ ఓ మీడియా ఇంటర్వ్యూలోనూ చెప్పుకొచ్చారు.

– బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...



## ఇంతకంటే ఘాటైన లుక్ మరొకటి ఉంటుందా?



ఆషురెడ్డి ప్రస్తుతం సోషల్ మీడియాలో తన గ్లామర్‌తో అందరినీ ఆకర్షిస్తోంది. మొదట జూనియర్ సమంతగా పాపులర్ అయిన ఆషురెడ్డి, ఇప్పుడు తన ప్రత్యేకమైన స్టైల్‌తో, ఆహార్యంతో సోషల్ మీడియాలో ఫ్యాన్స్‌కి ఎంటర్‌టైన్‌మెంట్ అందిస్తోంది. ఆషు తన మొదటి రోజుల్లో షార్ట్ వీడియోలతో మంచి పాపులారిటీ సంపాదించుకుంది, ఆ తర్వాత టెలివిజన్ షోలలో పాల్గొని పేరు పొందింది. రెండుసార్లు బిగ్‌బాస్ షోలో పాల్గొనడంతో ఆమె క్రేజ్ మరింత పెరిగింది. ఆ షో తర్వాత ఆషు ఓటీటీ, టీవీ షోలలో హోస్ట్‌గా రాణించింది. తన నమ్మకాన్ని మరింతగా పెంచుకున్న ఆమె, సోషల్ మీడియాలో తన ఫాలోవర్స్‌తో రోజూ కనెక్ట్ అవుతూ హాట్ ఫోటోషూట్స్‌తో అభిమానులను మెప్పిస్తోంది. ఆర్జీవీతో చేసిన బోల్డ్ ఇంటర్వ్యూ ఆమెకు ఊహించని గుర్తింపు తెచ్చింది.

అలాగే ఆమె ఇమేజ్‌ను పూర్తిగా మార్చింది. కెరీర్ ప్రారంభంలో బొద్దుగా కనిపించిన ఆషు, ఇప్పుడు స్లిమ్ లుక్‌లోకి మారి, బాలీవుడ్ నాయికలతో పోటీ చేసే రేంజ్‌లో గ్లామర్ ప్రదర్శన చేస్తోంది. ఆషు తాజాగా రెడ్ కలర్ బ్లేజర్‌లో పోజులు ఇచ్చిన విధానం స్టన్ అయ్యేలా చేస్తోంది, ఆ ఫోటోలని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. ఆమె గ్లామర్ ఫోజులు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోలు చూసిన అభిమానులు ఆమె ఏంజిల్ లా ఉందని కామెంట్ చేస్తున్నారు. ఆషురెడ్డి ఇప్పుడు టాలెంట్‌తో పాటు గ్లామర్ షోలోనూ తన ప్రత్యేకతను చూపిస్తూ అలరిస్తోంది. ప్రస్తుతం ఆమె సూపర్ హీరో కాన్సెప్ట్ మీద తెరకెక్కుతున్న "ఏ మాస్టర్ పీస్" అనే సినిమాలో నటిస్తోంది. మరికొన్ని సినిమాలు డిస్కషన్ స్టేజ్‌లో ఉన్నాయనే వార్తలు వినిపిస్తున్నాయి.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...




# ఎవరీ అశ్వనీ వైష్ణవ్?

ఒడిషా కేడర్ ఐఏఎస్ అధికారి, వాజ్‌పేయి ప్రైవేట్ కార్యదర్శి

కార్పొరేట్ కంపెనీల బాస్, ఒడిషా భూ ఆక్రమణ కేసుల్లో ముద్దాయి

ప్రస్తుతం మూడు మంత్రి పదవులు నిర్వహిస్తున్న రాజ్యసభ సభ్యుడు



- దుప్పల రవికుమార్

మొన్న జూన్ 17న పశ్చిమ బెంగాల్‌లో డార్జిలింగ్ జిల్లాలో రైలు ప్రమాదం జరిగినపుడు మోటార్‌సైకిల్ మీద ప్రమాద స్థలానికి వచ్చేసి హడావిడి సృష్టించిన కేంద్ర రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ ప్రచారంలో మోదీని మించిపోయారని విమర్శకులు తిట్టిపోశారు. కాని అత నేమీ లాల్‌బహదూర్ శాస్త్రి కాదు కదా! అందుకే రైలు ప్రమాదాలు ఎన్ని జరిగినా నిమ్మకు నీరెత్తినట్టే ఉంటా డాయన. ఎక్కడో సాంకేతిక కారణంతో 1956లో రైలు ప్రమాదం జరిగితే ఒకసారి కాదు రెండుసార్లు రాజీనామా చేసిన చరిత్ర ఆ శాస్త్రిది. దీనికి భిన్నంగా ఇప్పటి మన రైల్వేమంత్రి ప్రధాని ఆలోచనలను ముందుకు తీసుకుపోవాలని నిరంతరం తహతహలాడే మనిషి. ఎగువ మధ్యతరగతి, ధనవంతుల రైలు ప్రయాణాలు మరింత సుఖవంతంగా ఎలా ఉండాలని నిరంతరం ఆలోచించే మనిషి. బీదవారి సంగతి ఎందుకు లెండి. అయినా వారెందుకు రైలు ప్రయాణాలు చేస్తారని? డార్జిలింగ్ సంఘటన తర్వాత ప్రతిపక్షం ఆయనను రైల్వే మంత్రి అని కాకుండా రీల్ మంత్రి అనే పిలుస్తున్నారు. అంటే ఎగతాళిగా కాదు. సీరియస్‌గా! ఎందుకంటే ఆయన కొన్ని వందల రీల్స్ చేసి ఇన్‌స్టాలో వదిలారు. ప్రొఫెషనల్స్‌తో రీల్స్ తీయించి, సోషల్ మీడియాలో వదిలిన తీరు చూస్తే మీరు కూడా అదే మాట అంటారు. పేదవారు ప్రయాణం చేయలేని అత్యంత వేగవంతమైన, అంతా ఎయిర్ కండిషన్‌తో కూడిన వందేభారత్ రైలు బళ్లు ఆయన చలవేనని మనం నమ్ముతాం. గత మూడేళ్లలో ఆయన దయవల్లనే భారత రైల్వే జ్వాజ్వాలమానంగా వెలుగొందుతుందని మనకు కళ్లు విచ్చుకుంటాయి.

అంతకు ఏడాది ముందు ఒడిషా రాష్ట్రం బాలాసోర్ జిల్లాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో 296 మంది మరణించగా, 1200మంది క్షతగాత్రులయ్యారు. భారత రైల్వే చరిత్రలో అత్యంత ఘోర ప్రమాదమది. దురదృష్టవశాత్తూ అక్కడ కూడా ఆయన షో మానలేదని అప్పటి పత్రికలు విమర్శించాయి. ఆ ప్రమాదం మీద సిబిఐ విచారణ జరిపింది. తలెత్తిన సాంకేతిక సమస్యలను అధిగమించడానికి రాజకీయ పరిష్కారం కనుగొనాలని సిఫారసు చేసింది. ఆ శిథిలాల నుంచి క్షతగాత్రలను మోస్తూ, తళతళలాడిపోయే శ్వేతవస్త్రాలు ధరించి ఆయన ఫోటోలు దిగారు. తర్వాత కాసేపటికి రోడ్డు మీద కొబ్బరిబొండాం తాగుతూ ఒడిషా రైతులతో ప్రమాదం గురించి ముచ్చట్లు చెపుతూ ఫోటోలు పత్రికలో వచ్చాయి. చాలా విచిత్రంగా అంతకు ముందు యుపిఏ హయాంలో రైల్వే మంత్రులుగా పనిచేసిన లాలూ ప్రసాద్ యాదవ్, మమతా బెనర్జీ చేసిన తప్పిదాలే ఇప్పటి ప్రమాదాలకు కారణమని ఆయన చెప్తుంటే, భారతీయ జనతా పార్టీ ఆ వ్యాఖ్యలు తమ పార్టీకి మేలు చేస్తాయనే నమ్మింది. అందుకే మందలించలేదు. సరికదా, మరి రెండు మంత్రిత్వ శాఖలు కట్టబెట్టింది.

### రాజ్యసభ సభ్యునికి మూడు మంత్రిత్వ శాఖలు

2019లో తొలిసారి రాజ్యసభకు అశ్విని వైష్ణవ్ ఎంపి కవ్వడమే చాలా నాటకీయంగా జరిగింది. ఆ ఏడాది రాజ్యసభలో ఒడిషా నుంచి ఖాళీ అయిన మూడు స్థానాలకు బిజెపి, బిజెడి పార్టీల ఉమ్మడి అభ్యర్థి అశ్విని కావడం విశేషం. వాజ్‌పేయి ప్రధానిగా పనిచేసిన కాలంలో ఆయనకు ప్రైవేట్ కార్యదర్శిగా పనిచేసిన అశ్వినిని బిజెపి ప్రతిపాదించింది. అప్పటి ఒడిషా ముఖ్యమంత్రి సమర్థించారు. దాంతో అశ్విని రాజ్యసభలో అడుగుపెట్టారు. కొద్దికాలానికే కేంద్ర మంత్రి పదవి వరించింది. అయితే అప్పటికి బిజెడికి తగినంత సంఖ్యాబలం ఉన్నప్పటికీ బిజెపి ప్రతిపాదించిన అభ్యర్థిని ఎలా రాజ్యసభకు పంపారో ఇప్పటికీ వీడని చిక్కుముడి. రాజ్యసభకు అశ్విని వైష్ణవ్ ఎంపికైనప్పుడు ఒడిషా విధానసభలో ఆసక్తికరమైన చర్చ జరిగింది. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ నేత నరసింగ మిశ్రా అశ్వినికి, ఒడిషా మైనింగ్ మాఫియాకు సంబంధాలున్నట్టు ఆరోపించారు. ఒడిషాలో సహజసంపద దోచుకోవడానికి వత్తాసు పలికిన మనిషిని రాజ్యసభకు పంపడం సిగ్గుచేటని అభివర్ణించారు. నవీన్‌పట్నాయక్ దీనిగురించి కూడా మౌనం పాటించారు.

ఫిబ్రవరి 2024లో రెండవసారి కూడా ఆయన రాజ్యసభకు ఉమ్మడి అభ్యర్థిగా ఎన్నికయ్యారు. తర్వాత నవీన్–మోదీ సంబంధాలు బీటలు వారాయి. మొన్నటి ఎన్నికలలో తమను చావుదెబ్బ కొట్టిన బిజెపిని ఇప్పుడు బిజెడి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. రాజ్యసభలో తమ 9 మంది ఎంపీలు మోదీ ప్రభుత్వానికి తీవ్రంగా వ్యతిరేకిస్తారని మొన్నటి ఎన్నికల తర్వాత నవీన్ వ్యాఖ్యానించారు. నిజానికి వైష్ణవ్ ఫక్తు రాజకీయ నాయకుడు కాదు. 1994 బ్యాచ్ ఒడిషా కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. తన కెరియర్ అంతా ఎంత వివాదాస్పదంగా ఉన్నా ఇంతింతై వటుడింతై అన్నట్టుగా ఆయన ఎదిగిపోయారు. 2003లో కేంద్ర సర్వీసుకు వెళ్లిన వెంటనే వాజ్‌పేయి ప్రభుత్వంలో పిఎంఓలో డెప్యుటీ సెక్రటరీగా చేరారు. అప్పటికి అక్కడ జాయింట్ సెక్రటరీగా ఉన్న అశోక్ సైకియా ఈయనను అక్కడికి తీసుకువెళ్లారని చెప్తారు. కాని 2004లో వాజ్‌పేయి ప్రధానిగా వైదొలిగారు. అయినా, ఆయనకు ప్రైవేట్ కార్యదర్శిగా అశ్విని కొనసాగారు. 2006లో గోవాలోని మార్మగావ్ పోర్ట్ ట్రస్ట్‌కు చేరారు. రెండేళ్ల తర్వాత స్టడీలీవ్ మీద అమెరికాలో వార్టన్ బిజినెస్ స్కూల్‌లో ఎంబిఏ చేసారు. అటునుంచి వచ్చాక సివిల్ సర్వీసులకు సెలవు చెప్పేశారు. కార్పొరేట్ కంపెనీలో సీనియర్ మేనేజ్‌మెంట్ స్థాయిలో చేరారు. జనరల్ ఎలక్ట్రిక్, సీమెన్స్ కంపెనీలలో పనిచేసారు. 2012లో గుజరాత్ చేరి, అక్కడ ఆటోమొబైల్ పరిశ్రమ స్థాపించి, పారిశ్రామికవేత్త అయ్యారు.

### ఆదినుంచీ వివాదాస్పదుడే!

రాజ్యసభ సభ్యుడు అయ్యాక 2021లో రైల్వేమంత్రిగా ప్రధానమంత్రి అవకాశమిచ్చారు. సాధారణంగా రైల్వేశాఖ రాజకీయాల్లో మల్లగుల్లాలు పడ్డవారికే దక్కుతుంది. అలాంటి కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తికి దక్కడం అందరినీ ఆశ్చర్యపరిచింది. వారి నోళ్లు మరింత సాగిపోయేటట్టు మన ప్రధాని వ్యవహరించారు. ఆయన కష్టపడే తత్వం తెలుసుకున్న ప్రధాని మరో రెండు శాఖలు క్రమంగా అప్పజెప్పారు. స్వతంత్ర భారత చరిత్రలో ఒక రాజ్యసభ సభ్యుడు మూడు శాఖలకు కేబినెట్ మంత్రి కావడం ఇదే ప్రథమం. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖలతో పాటు ఎలక్ట్రానిక్స్, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ కూడా ఆయనకే అప్పజెప్పారు. దీనిబట్టే ఆయన మోదీకి ఎంత దగ్గర మనిషో మనకు అర్థమవుతుంది. 2024 ఎన్నికల తర్వాత కమ్యూనికేషన్స్ శాఖను జ్యోతిరాదిత్య సింధియాకు అప్పగించి, అశ్విని వద్ద ఇన్ఫర్మేషన్, బ్రాడ్‌కాస్టింగ్ శాఖలుంచారు. రైల్వే మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడానికి మూడు రోజుల ముందువరకూ అశ్విని పలు కంపెనీలలో కీలక పదవుల్లో ఉండేవారు. అందులో తమిళనాడుకు చెందిన బి.ప్రభాకరన్ కంపెనీలు కొన్ని కాగా, మరికొన్ని సజ్జన్ జిందాల్ కంపెనీలు. వీరిద్దరితోనూ అంటకాగి, అనతికాలంలోనే అద్భుతమైన పారిశ్రామికవేత్తగా ఎదిగిన అశ్విని మంత్రి అయ్యాక ఆ కంపెనీలకు దూరమయ్యారు.

వివిధ కార్పొరేట్ సంస్థలలో ఆయన తన పదవులకు రాజీనామా చేసేసారే గాని, ఆయన కుటుంబ సభ్యులంతా ఇంకా చాలా కంపెనీల్లో పదవులు నిర్వరిస్తున్నారు. ఆయన భార్య సునీతా వైష్ణవ్, కొడుకు రాహుల్ వైష్ణవ్, కుమార్తె తాన్యా వైష్ణవ్ ఇప్పటికీ గురుగ్రామ్, హర్యానా, ఢిల్లీ శివార్లలో ఉన్న కంపెనీలలో కీలక పదవుల్లో ఉన్నారు. అశ్విని జులై 2021లో సమాచార శాఖ మంత్రి అయిన తర్వాత పెగాసస్ కుంభకోణం బయటపడింది. ఇజ్రాయెల్‌కు చెందిన పెగాసస్ కంపెనీ దగ్గర కొన్న సాఫ్ట్‌వేర్‌తో రాజకీయ నేతల, ప్రత్యర్థుల ఫోన్లు టాపింగ్‌లో ఉన్నాయని వైర్ ప్రచురించిన కథనం ప్రపంచాన్ని కుదిపేసింది.


ఒక కథనంలో ఆయన మంత్రి కాకమునుపు ఆయన ఫోన్లో కూడా ఈ పెగాసస్ సాఫ్ట్‌వేర్ ఉన్నట్టు ఆరోపించింది. ఆ కేసు ఇప్పటికీ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది. రైల్వే మంత్రి అయిన తర్వాత ఆ శాఖలో ఉద్యోగాల నియామకాలను ఆపేసారని పలు రాష్ట్రాలలో యువత ఆందోళనలు చేసింది. మొక్కుబడిగా నియామక ప్రకటనలు జారీ చేయడం, భర్తీలో అలవికాని జాప్యం చేస్తారని గొప్ప పేరు గడించారు. మంది ఎక్కువైతే మజ్జిగ పలుచబడుతుందనే సామెతను నమ్మిన అశ్విని భారతీయ రైల్వేలో నూతన ఉద్యోగాలు అవసరం లేదని నమ్ముతారు. సొంత రాష్ట్రమైన జార్ఖండ్‌లో ఎలాంటి వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నారో తెలియదు కాని దీర్ఘకాలం సివిల్ సర్వెంటుగా పనిచేసిన ఒడిషా రాష్ట్రంలో అనేక స్థల వివాదాల్లో ఆయన పేరున్నట్టు ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆరోపిస్తోంది.



నగరంలోని స్థానిక ఏడురోడ్ల కూడలిలో ఉన్న శ్రీ కౌశికి జ్యూయలర్స్ (ఎస్‌కేజే) యాజమాన్య ప్రతినిధి పేర్ల సాంబమూర్తి ఆధ్వర్యం లో బుధవారం నుంచి ఉచితంగా వినాయక విగ్రహాలు, చవితి వ్రతకల్ప పుస్తకాన్ని షోరూం వద్ద అందజేస్తున్నట్టు ప్రకటించారు. ఆసక్తి కలిగిన వారంతా వీటిని ఉచితంగా పొందాలని కోరారు. – సత్యంన్యూస్,శ్రీకాకుళం



వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా బీఎస్‌ఎన్‌ఎల్ కార్పొరేట్ కార్యాలయం ఆవరణలో బుధవారం లయన్ ప్రతినిధులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి అధ్యక్షుడు వావిలపల్లి జగన్నాథనాయుడు, టెలికాం ఏజీఎం బి.యోగేశ్వరరావు, పూర్వ అధ్యక్షుడు కె.ఎన్.ఎస్.వి.ప్రసాద్, లయన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. – సత్యంన్యూస్, శ్రీకాకుళం.



లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సమకూర్చిన విరాళాన్ని సీఎం రిలీఫ్ ఫండ్‌కి ఎమ్మెల్యే గొండు శంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో నటుకుల మోహన్, గుత్తు చిన్నారావు, రెడ్డి గిరిజా శంకర్, ప్రధాన విజయరాం తదితరులు పాల్గొన్నారు. – సత్యంన్యూస్, శ్రీకాకుళం

## మట్టిగణపతి ప్రతిమలు పంపిణీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలే శ్రేష్ఠమని మానవతా సేవ సంస్థ సభ్యులు అన్నారు. రాగోలు కూడలి వద్ద మానవతా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, వైస్‌చైర్‌పర్సన్ నటుకుల మోహన్, అధ్యక్షులు పొన్నాడ రవికుమార్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మానవతా సంస్థ సభ్యులు మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, వాతావరణం, నీరు కాలుష్యం కాకుండా ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే పూజించాలన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ నటుకుల మోహన్, పార్వతీశం, ఎస్.ప్రవీణ్,అప్పారావు, ముక్కు రమణ, కసవయ్య, ప్రసాద్, ఉర్లం శివతేజలు పాల్గొన్నారు.



## వరదల్లో శ్రీసత్యసాయి సంస్థలు సేవలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విజయవాడ వరద బాధితులకు సత్యసాయి సేవాసంస్థలు, సేవాదళ్ ద్వారా సుమారు 10వేల మందికి మంచినీరు, పాలు, బ్రెడ్, రస్కులు, కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు, బిస్కెట్లు, బన్నులు అందజేసినట్లు రాష్ట్ర అధ్యక్షులు రఘుపాత్రుని లక్ష్మణరావు తెలిపారు. బుధవారం వరద బాధితుల సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్న రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సత్యసాయిసేవలను అభినందించారు. వరదలలో చిక్కుకున్న సింగ్‌నగర్, భవానీనగర్ కాలనీ వాసులను సత్యసాయి డిజాస్టర్ మేనేజ్మెంట్ సేవాదళ్‌తో పట్టణ శివారులకు ఆహారం తరలించినట్లు తెలిపారు. ఆహారం అందని ప్రాంతాలకు సేవాదళ్ ద్వారా ఆహారం, అత్యవసర సరుకులు అందజేస్తున్నట్లు వివరించారు. సహాయక కార్యక్రమాల్లో రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేంద్ర సాయి, రాష్ట్ర సేవా సమన్వయకర్త శ్యాం ప్రసాద్, సాయి సేవాదళ్ పాల్గొన్నారు.



## నిత్యావసరాల ధరలు తగ్గించాలి

(సత్యంన్యూస్, టెక్కలి)

నిత్యావసరాల ధరలు తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.యుగంధర్ డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయసమితి పిలుపులో భాగంగా పెరిగిన నిత్యావసర వస్తువులు ధరలపై ఈనెల 6 వరకు జరిగే ప్రచార, నిరసనలకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను మండల కేంద్రంలో విడుదల చేశారు. అనంతరం యుగంధర్ మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. కూరగాయల ధరలు కూడా ఆకాశాన్ని తాకుతున్నాయన్నారు. ధరలు నియంత్రణ లేకపోవడంతో పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందన్నారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను కేంద్రంలో మోడీప్రభుత్వం అనేకసార్లు పెంచి సామాన్య ప్రజలకు అవస్థలకు గురి చేసిందన్నారు. జనజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్న అధికధరలను అరికట్టి, పెరిగిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు ప్రభుత్వాలు సామాన్యుల జీవితాల గురించి ఆలోచించాలని, వాళ్ళు సంపాదించే కూలి రేట్లు పెరిగిన ధరలకు సరిపోవడం లేదన్నారు. రేషన్ కార్డుదారులకు ఈకేవైసి ప్రక్రియ సులభతరం చేయాలన్నారు. కార్యక్రమంలో కుమార్, రామారావు, సింహాచలం, రాము, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు






## పెద్ద మందిరానికి రూ.10 వేలు విరాళం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని సత్యసాయి పెద్దమందిరంకు నగరంలోని ప్రభాకర్ కాలనీకి చెందిన నైరా వ్యవసాయ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ అరికతోట కనకరాజు, ఉమా దంపతులు బుధవారం రూ.10వేలు విరాళాన్ని శ్రీకాకుళం కన్వీనర్లు ఎం.నాగభూషణం, కంబ మురళీకృష్ణకు అందజేశారు. వినాయకచవితితోపాటు, ఈనెల 12నుంచి 16వరకు 100 గంటల సాయిభజనకు అయ్యే ఖర్చుకు దీన్ని వినియోగించాలని దాతలు కోరారు.





















# బాధితులకు బాసటగా మున్సిపల్ కార్మికులు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

విజయవాడలో వరదల కారణంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సహాయ సహకారాలు అందించేందుకు శ్రీకాకుళం మున్సిపల్ కార్మికులు విజయవాడకు బయలుదేరారు. ఈ బస్సును శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల కారణంగా విజయవాడ ప్రాంతంలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి సహాయ సహకారాలు అందించేందుకు మానవతాదృక్పథంలో జిల్లాకు చెందిన మున్సిపల్ కార్మికులను విజయవాడ తరలించినట్టు వివరించారు. జిల్లా నుంచి పలు స్వచ్ఛంద సంస్థలు స్పందించి పెద్ద ఎత్తున ఆహార పదార్థాలు, దుస్తులు అందజేయడం గొప్ప విషయమన్నారు. విపత్తుల సమయంలో బాధితులను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, నిస్సహాయ స్థితిలో ఉండిపోయినవారికి చేయూతనందించేందుకు ప్రతీఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విరాళాలు అందజేసి బాధితులకు బాసటగా నిలవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు.

# జిల్లా బ్యాడ్మింటన్‌కు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తేవాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

విద్యార్థులకు చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తి పెరిగేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని, క్రీడలకు ఆదరణ పెరగాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నదుకుదుటి ఈశ్వరరావు ఆకాంక్షించారు. శ్రీకాకుళం జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న డీఎస్ఏ ఇండోర్ స్టేడియం వేదికగా మూడు రోజులపాటు నిర్వహించనున్న ఏపీ రాష్ట్రస్థాయి (అంతర్ జిల్లాల) జూనియర్స్ (అండర్-19) బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్షిప్ పోటీలను వీరు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమని, క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని తెలిపారు. జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో జిల్లాకు పేరు తెచ్చారని చెప్పారు. సాధించాలన్న తపన, పట్టుదలతో ప్రయత్నిస్తే విజయాలు సొంతమవుతాయని చెప్పారు. త్వరలోనే కోడిరామ్మూర్తి స్టేడియాన్ని అందుబాటులోకి తెచ్చి అన్ని క్రీడాంశాల్లో జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించుకునేలా ప్రతి ఒక్కరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.




# ఎరువులు బ్లాక్ చేస్తే డీలర్ల లైసెన్స్ రద్దు: కలెక్టర్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

ఈ సీజన్లో ఎరువుల పంపిణీ జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా జరుగుతోందని, ఎరువులను డీలర్లు బ్లాక్ చేస్తే లైసెన్స్ రద్దు చేస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. ఈ సీజన్ లక్ష్యం 61,262 టన్నులు కాగా, లక్ష్యానికి మించి ఇప్పటి వరకూ 65,007 టన్నులు సరఫరా చేశామన్నారు. ఈ సెప్టెంబర్ నెలకు సంబంధించి ఎరువుల పంపిణీకి ప్రణాళిక సిద్ధం చేసినట్టు వివరించారు. గత నెల 28న జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యేలు, ఇతర సభ్యులు లేవనెత్తిన పలు అంశాలపై కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. భవిష్యత్తు అవసరాలకు జిల్లా కేంద్రాల నుంచి మండల కేంద్రాలకు, గ్రామాలకు అవసరమైన ఎరువులను ముందస్తుగా నిల్వ చేయాలని, జిల్లా, డివిజన్, మండల అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని, ఎక్కడైనా నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకోవాలని, డీలర్లు బ్లాక్ చేస్తే లైసెన్స్‌లు రద్దు చేయాలని ఆదేశించారు. ఆశా వర్కర్లు జాబ్‌చార్ట్ ఆధారంగా పనిచేసేలా పర్యవేక్షించే బాధ్యత డిఎంహెచ్‌వోదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. పలు నిబంధనల కారణంగా కరువు మండలాలుగా ప్రకటించే అవకాశం లేని మండలాలకు పంటల బీమాను వర్తింపచేయాలని ప్రభుత్వానికి నివేదించామని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, జెడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు, డీసీవో నగేష్, డీఎంహెచ్‌వో డాక్టర్ మీనాక్షి, జిల్లా రిజిస్ట్రార్ కిల్లి మన్మధరావు, వ్యవసాయశాఖ జేడి కె.శ్రీధర్, నీటిపారుదల శాఖ ఎస్ఈ పొన్నాడ సుధాకరరావు, డ్వామా పీడీ ఎన్.వి.చిట్టి రాజు, డీఈవో తిరుమల చైతన్య తదితరులు పాల్గొన్నారు

## వరద బాధితుల కోసం సిటు విరాళాల సేకరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విజయవాడ వరద బాధితుల సహాయనిధికి విరాళాలు ఇవ్వడంలో జిల్లా ప్రజలు స్పందించిన తీరు అభినందనీయమని సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఉపాధ్యక్షులు కె.నాగమణి అన్నారు. సిటు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా బుధవారం ఆర్టీసీ కాంప్లెక్స్, కోర్టు వద్ద సహాయనిధి వసూలుచేశారు. విజయవాడ, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో వర్షాలు, భారీ వరదలతో అనేక మంది నిరాశ్రయులుగా మారారని, భారీ ఆస్తినష్టంతో అనేకమంది మృత్యువాతపడ్డారన్నారు. వరద ముంపు ప్రాంతాల్లో వారిని ఆదుకోవాలని కోరుతూ వరద బాధితులకు రూ.13,245 విరాళాలు సేకరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో కె.సూరయ్య, కె.నాగమణి, ఆర్.ప్రకాశరావు, డి.పార్వతీశం, పి.శాంతారావు, ఐలూ నాయకులు డి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వీక్షిత్ లక్ష్యంపై దృష్టి సారించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వీక్షిత్ ఆంధ్రా 2047 విజన్ లక్ష్యంగా పట్టణ మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి చేయాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ పథక సంచాలకులు ఎం.కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక రైతుబజార్ వద్ద ఉన్న పట్టణ మహిళా సామాజిక వనరుల కేంద్రంలో మెప్మా జిల్లా సిబ్బందికి, పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షులకు, పట్టణ సమాఖ్యల ఆర్పీలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ పట్టణ స్వయం సహాయక సంఘాలు, వీధి విక్రయదారులు, విభిన్న ప్రతిభావంతుల్లో సుస్థిర జీవనోపాధులు పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్‌బీయూ సర్వేలో గుర్తించిన నిరుద్యోగ ఔత్సాహికులతో సంఘాలు ఏర్పాటు చేసి, వారికి బ్యాంకు రుణ సౌకర్యం కల్పించడం, యాచకులతో గ్రూపులు ఏర్పాటు చేసి వారికి కూడా బ్యాంకు రుణ సౌకర్యం కల్పించడం ద్వారా 2047 నాటికి భిక్షాటన లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి కట్టుబడి పనిచేయాలని తెలిపారు. నిరాశ్రయులను ఆదుకునేందుకు రాత్రి వసతి గృహాలను ఏర్పాటుకు సంబంధిత మున్సిపల్ కమిషనర్లు సమన్వయంతో కృషి చేయాలన్నారు. శిక్షణలో మెప్మా పరిపాలనాధికారి ఎస్.వి.రమణ, అకౌంటెంట్ ఏ.వెంకటరావు, రాము, వెంకటరావు, భాస్కరరావు, విజయకుమారి, శ్రీకాకుళం నగరపాలక, ఆమదాలవలస, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం పురపాలక సంఘాల సిబ్బంది పాల్గొన్నారు.





# జిల్లాలో బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో బీజేపీ సాధారణ సభ్యత్వ నమోదు ప్రారంభోత్సవ కార్యక్రమం నగరంలోని 80 అడుగుల రోడ్డులోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు అధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ 2014లో శ్రీకాకుళం జిల్లాలో సభ్యత్వ నమోదు పెద్ద ఎత్తున జరిగిందని, ఇప్పుడు కూడా అంతకు మించి సభ్యత్వ నమోదు చేయాలని పార్టీ నాయకులను కోరారు. ఎవరు పార్టీలో చేరాలన్నా పార్టీ తలుపులు తెరిచే ఉన్నాయని, మంచి వ్యక్తులతో సంస్థాగత నిర్మాణం చేసుకోవాలని కోరారు. జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, పూడి తిరుపతిరావు, పైడి వేణుగోపాలం, శవ్వాన ఉమామహేశ్వరి, జిల్లా ఇంఛార్జ్ ఎన్.విజయానంద రెడ్డి, బీజేపీ జిల్లా సభ్యత్వ నమోదు కన్వీనరు చల్లా వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో అట్టాడ రవి బాబ్జి, చింతపల్లి దుర్గారావు గాంధి, సలాన రాఘవరావుతో పాటు జిల్లా నాయకులు పాల్గొన్నారు.




# వరం వల్లనే కోమట్లకు జాతీయస్థాయి గుర్తింపు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

**నగర అభివృద్ధిలో అంధవరపు కృషి స్ఫూర్తిదాయకం**
**అన్నా క్యాంటీన్‌కు వరం కుటుంబం రూ.3 లక్షలు విరాళం**
**చిరువ్యాపారులకు 15 తోపుడు బళ్లు పంపిణీ**
**ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాలు**

మాజీ మున్సిపల్ చైర్మన్ అంధవరపు వరహానర్సింహం (వరం) చలువ వల్లనే కళింగకోమట్లకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం వరం జయంతిని పురస్కరించుకొని నగరంలోని గుజరాతీపేట వరం హైస్కూల్, ఏడురోడ్ల కూడలిలోని వరం విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏడురోడ్ల జంక్షన్‌లో నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన మాట్లాడుతూ సిక్కోలు రాజకీయాల్లోనూ, వ్యాపార వర్గాల్లోనూ, కళింగకోమటి సామాజిక వర్గంలోనూ, పేదల మనసుల్లోనూ వరం ఓ బ్రాండ్ ఇమేజ్‌ను సృష్టించుకున్నారన్నారు. చేసిన సేవలే చరిత్రలో చిరకాలం నిలిచిపోతాయనడానికి వరం జీవితమే నిదర్శనమన్నారు. నగర విస్తరణ, అభివృద్ధిలో వరం చూపిన కృషి తమకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయన్నారు. వరం ఉత్తమ ఆశయాలను, ఆలోచనలకు ముందుకు తీసుకెళ్లే దిశగా కుటుంబ సభ్యులు కృషి చేయడాన్ని అభినందించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మానస పుత్రిక అన్నాక్యాంటీన్ నిర్వహణకు వరం కుటుంబ సభ్యులు రూ.3 లక్షల చెక్కును ఎమ్మెల్యే శంకర్‌కు అందజేశారు. నిరుపేదల జీవనోపాధి కోసం 15 తోపుడు బండ్లను లబ్ధిదారులకు అందజేశారు. కళింగకోమటి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోయిన గోవిందరాజులు మాట్లాడుతూ వరం నిజాయితీగా రాజకీయాలు చేయడం వల్లే ఆయనను ప్రజలు ఇప్పటికీ స్మరించుకుంటున్నారని, వారి కుటుంబం కూడా అదే స్థాయిలో సేవా కార్యక్రమాలు చేయడం గొప్ప విషయమన్నారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్, వరం కుమార్తె పైడి శెట్టి జయంతి మాట్లాడుతూ కోరిన వారికి తోచిన సాయం చేయాలని తన తండ్రి చెప్పిన మాటలకు కట్టుబడి సోదరులు అంధవరపు ప్రసాద్, సంతోష్, కుటుంబ సభ్యులమంతా కలిసి వరం ఛారిటబుల్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

**తప్పుడు ప్రచారాలు తగదు**

ఇటీవల ఓ వ్యక్తి పుట్టినరోజు వేడుకల సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన అంశాన్ని భూతద్దంలో చూపించి తాను తప్పు చేసినట్టు కొందరు తప్పుడు ప్రచారాలు చేయడాన్ని ఎమ్మెల్యే శంకర్ ఖండించారు. ఎన్నికల సందర్భంగా ఓట్ల కోసం వారి ఇళ్ల వద్దకు వెళ్లిన విషయాన్ని గుర్తుచేశారు. తప్పు చేస్తేనే నిందించాలి తప్పా చౌకబారు ప్రచారాలు చేయవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోరాడ హరగోపాల్, జామి భీమశంకర్, పీఎంజే బాబు, పాండ్రంకి శంకర్, పీవీ రమణ, కొర్ను ప్రతాప్, అంబటి లక్ష్మీరాజ్యం, అరవల రవీంద్ర, మాదారపు వెంకటేష్, మెండ దాసునాయుడు, నాగేంద్ర యాదవ్, కెల్ల కొండలరావు, సిరిపురపు హరి, అర్జున్, జనసేన నాయకులు కోరాడ సర్వేశ్వరరావు, బీజేపీ నాయకులు పైడి వేణుగోపాలం, పైడి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

# పాపాలు కడిగేస్తున్నారు..!

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం ఆ తర్వాత ఏజెన్సీల ద్వారా ఉద్యోగులను కొనసాగిస్తూ వచ్చింది. ఐదేళ్ల పాటు అభద్రతా భావంతో విధులు నిర్వహించి ఉద్యోగ భద్రతకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తున్న ఉద్యోగులంతా ఏపీ బేవరేజెస్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి బాధితులనే ఆరోపణలున్నాయి. కార్పొరేషన్ ఉద్యోగులుగా గుర్తిస్తామని హామీ ఇచ్చి ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా వేతనాలు చెల్లించడం, సిబ్బంది వేతనాల్లో కోతలు విధించడం చేశారని ఆరోపణలు వినిపించాయి. మద్యం దుకాణాల్లో పనిచేసే సిబ్బందిని ఏపీ బేవరేజస్ కార్పొరేషన్‌లో కలుపుతానని హామీ ఇచ్చినా దీన్ని అమలుచేయనీయకుండా వాసుదేవరెడ్డి అడ్డుకున్నట్లు ప్రచారం ఉంది. ఐదేళ్ల నుంచి వేతనాల్లో పీఎఫ్, ఈఎస్ఐ పేరుతో కోతలు విధించి అదనపు గంటలు పని చేసినందుకు ఇవ్వాల్సిన వేతనాలు ఇవ్వలేదని విమర్శలు ఉన్నాయి.

జిల్లాలో 193 ప్రభుత్వ మద్యం షాపుల్లో ఒక్కో షాపునకు ఒక సూపర్‌వైజర్, ముగ్గురు సేల్స్‌మెన్స్, వాచ్‌మెన్, సెక్యూరిటీగార్డ్, ఒక స్వీపర్‌ను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించి వేతనాలు చెల్లించాలని నిర్ణయించింది. పట్టణాల్లో మద్యం దుకాణాల్లో ఆరుగురు చొప్పున, గ్రామీణ ప్రాంతాల్లో ఐదుగురు చొప్పున సిబ్బందిని నియమించారు. వీరితో పాటు ఒక స్వీపర్‌ను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించింది. బీకాం అర్హతతో సూపర్‌వైజర్, ఇంటర్ అర్హతతో సేల్స్‌మెన్‌లను ఏడాది కోసం విధుల్లోకి తీసుకొని ఆ తర్వాత రెడ్డి ఎంటర్‌ప్రైజెస్ పేరుతో ఒక ఏజెన్సీ ద్వారా రెండేళ్ల పాటు వీరికి వేతనాలు చెల్లించారు. తర్వాత థర్డ్ ఐ అనే మేన్‌పవర్ ఏజెన్సీ ద్వారా రెండున్నరేళ్లు కొనసాగించారు. ఆ ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలల కోసం ఆగస్టు 13న ఎన్డీయే ప్రభుత్వం మేన్‌పవర్ ఏజెన్సీ కోసం ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ ఈ-టెండర్ ప్రకటన విడుదల చేసి కొత్త ఏజెన్సీకి రెండు నెలల కోసం ఉద్యోగుల వేతనాలు చెల్లింపులకు టెండర్ ఇచ్చింది. కొందరి పనితీరు సంతృప్తికరంగా లేదని, అక్రమాలకు పాల్పడ్డారని తొలగిస్తూవచ్చారు. రెన్యువల్ కోసం, బదిలీల కోసం పెద్ద మొత్తంలో ఎక్సైజ్ అధికారులు సొమ్ములు దండేశారు. ఇది కాకుండా స్టాక్‌లో తేడాలు వంటివి వారితోనే కట్టించారు. ఎక్సైజ్ ఈఎస్ సుబ్బారావు లాంటివారు తమకు అవసరమైన ఫుల్‌బాటిళ్లు షాపు నుంచి తీసుకువెళ్లిపోయినా, అవి సిబ్బంది ఖాతాలోనే జమయ్యేవి. జిల్లాలో ఒక్కో పోస్టుకు రూ.60వేలు నుంచి రూ.1.50 లక్షల వరకు వసూలు చేశారు. నాయకులు సిఫార్సు చేసినా జేసీ స్థాయి వ్యక్తులు ఇంటర్వ్యూ చేసి తీసుకున్నామని చెప్పినా ఎక్సైజ్ ఈఎస్ మాత్రం సొమ్ములివ్వందే అపాయింట్‌మెంట్ ఆర్డరివ్వలేదు.. అది ఇప్పటి సుబ్బారావు గాని, అంతకు క్రితం పని చేసిన ఆదినారాయణమూర్తి గాని.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.